APTEL/26A5612

# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు — తెలుగు దినపత్రిక

అనంతపురం | ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 89 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | పేజీలు : 8 | వెల : 2/-



## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్

- 2 అడుగుల వెడల్పు - 32 అడుగుల ఎత్తు
- విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి
- ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్.

అమరావతి

విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి. ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్. - మిగతా3లో

## ఈసీ ప్రకటనతో అపోహలకు

# తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



అమరావతి

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, - మిగతా3లో



### ఫారం-6లో చట్ట, రాజ్యాంగ

## విరుద్ధమైన మార్పులు

- సీఈసీ ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారు
- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ ఆగ్రహం
- ఫారం 6లో ఆయన చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేశారని మండిపాటు
- ఓటరు నమోదు ప్రక్రియలో ఈసీ చేసిన మార్పులతో జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపణలు

## నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం..

రెండు రోజుల్లో 19 మంది మృతి

ఘటనపై సిట్ దర్యాప్తు ప్రారంభం

మద్యం నమూనాలు ఫోరెన్సిక్ పరీక్షలకు తరలింపు

19 మందిని అరెస్టు చేసిన పోలీసులు

దాదాపు 3 వేల బాటిళ్ల స్వాధీనం

అనుమానిత మద్యం సేవించొద్దని పోలీసుల హెచ్చరిక






## 'సర్' నోటీసులు.. అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

- నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదు.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారు
- రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి
- ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది
- ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది
- ఓటర్లు, యువకులు కంటిన్యుయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు

### పరవాడ ఫార్మా కాలుష్యంపై

## పవన్ కల్యాణ్ సీరియస్



- 95 కంపెనీలకు నోటీసులు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

అమరావతి

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో - మిగతా3లో

# పేదలకు పట్టాభిషేకం




- ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు
- ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ
- 24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు
- రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం
- దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- 8 నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు ప్రయోజనం

అమరావతి

పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత - మిగతా3లో



## పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

- లోక్‌సభ స్పీకర్‌కు జితిన్ రామ్ మాంజీ లేఖ
- సభలో కీలక బిల్లులపై చర్చ జరిగే సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అదనపు సమయం ఇవ్వాలన్న మాంజీ
- తమ సామాజిక వర్గానికి తగినంత సమయం అవసరమన్న మాంజీ
- తమ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించాలని విన్నపం

## పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు

- ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?
- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు
- పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు



# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు

## రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా


## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: మంత్రి సవిత

**విద్యార్థినుల ఆటలు తిలకించిన మంత్రి సవిత**

**పెనుకొండ సెప్టెంబర్ 25 తెలుగు స్వరం:**



పెనుకొండ మండలంలోని రాంపురం ఎం.జె.పి. బాలికల పాఠశాలను మంత్రి సవిత శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినుల విద్యా బోధన, వసతులు, ఇతర అంశాలను పరిశీలించిన మంత్రి, అనంతరం విద్యార్థినులు క్రీడల్లో పాల్గొంటున్న తీరును వీక్షించారు. సాయంత్రం సమయంలో విద్యార్థినులు వివిధ ఆటలు ఆడుతుండటాన్ని చూసిన మంత్రి సవిత వారితో కొద్దిసేపు ముచ్చటించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థినులు చదువులోనే కాకుండా క్రీడా రంగంలోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.





# సమాజ శ్రేయస్సు కై...
# జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉండాలి..!!

**.....పుట్టపర్తిలో ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం**

**.....రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలతో నిర్వహణ.**

**.....జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు విస్తృత వైద్య సేవలు**

**.....అగ్రగామి ఆసుపత్రుల నిపుణులైన వైద్యులచే ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ.**

**..... పాల్గొన్న....మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి.**

**పుట్టపర్తి,సెప్టెంబర్,26: తెలుగు స్వరం.**

నిరంతరం సమాజ హితం కోసం శ్రమిస్తూ, బిజీ జీవనశైలి కారణంగా స్వంత ఆరోగ్యాన్ని పక్కనపెట్టే జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. శనివారం ఉదయం గణేష్ సర్కిల్ లోని సాయి ఆరామం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి గౌరవనీయులు సత్యకుమార్ యాదవ్ మరియు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ గౌరవనీయులు శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ వైద్య శిబిరంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యులు మొత్తం 456 మంది పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందారు.

**అగ్రగామి వైద్య సంస్థల భాగస్వామ్యం**

ఈ మెగా వైద్య శిబిరంలో దేశంలోనే పేరుగాంచిన ప్రముఖ వైద్య సంస్థల నుంచి నిపుణులైన వైద్య బృందాలు పాల్గొని జర్నలిస్టులకు సేవలు అందించాయి.వైదేహి హాస్పిటల్ (బెంగళూరు),స్విమ్స్ – తిరుపతి),బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రజ్ఞా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) స్టేట్ అసోసియేషన్ మరియు అప్నా డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు,సమగ్ర వైద్య పరీక్షలు – – గణాంకాలు వివిధ విభాగాలకు చెందిన సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్య నిపుణులు రోగులను క్షుణ్ణంగా పరిశీలించి ఉచితంగా మందులు, అవసరమైన వారికి తదుపరి చికిత్సపై తగిన సలహాలు అందించారు.

**శిబిరంలో నిర్వహించిన ముఖ్యమైన పరీక్షల వివరాలు...**

జనరల్ మెడిసిన్ 106,ల్యాబ్ పరీక్షలు 128,క్యాన్సర్ స్క్రీనింగ్ 110, ఈక్యూజీ 78,కంటి పరీక్షలు 98,జనరల్ సర్జరీ 88,2ఙ ఎకో 56, అస్థిపంజర/ఎముకల వైద్యం 56,చర్మ వ్యాధుల వైద్యం 54,దంత వైద్యం 45,నరాల వైద్యం34,శ్వాసకోశ వైద్యం 32,క్యాన్సర్ స్క్రీనింగ్‌కు - మిగతా3లో

## "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -తో....రాయలసీమ రైజింగ్"..!!

**.....జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యాన రైతులకు, పారిశ్రామికవేత్తలకు, విద్యార్థులకు, అవగాహన.**

**.....ఈనెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 05 వరకు అవగాహన కార్యక్రమాలు.**

**......జిల్లా నుంచి సుమారుగా రూ.2,252 కోట్లకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది.**

**.....ప్రెస్ మీట్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.**



**అనంతపురం, సెప్టెంబర్ 26 తెలుగు స్వరం.**

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్" అంశంపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుపుకొని, రాయలసీమలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్" తో హార్టికల్చర్ ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడానికి ఒక ఉద్యమం ప్రారంభిస్తున్నారని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ మదనపల్లెలో దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గారు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రారంభిస్తారన్నారు.ఉద్యానవన శాఖ, జల వనరుల శాఖ, పంచాయతీరాజ్ శాఖ మరియు ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది అన్నారు. మొత్తం ఒక లక్ష కోట్ల పెట్టబడిలో ప్రభుత్వ పెట్టుబడి 40,000 కోట్ల రూపాయలు కాగా, అందులో ఉద్యానవన రంగం కింద హార్టికల్చర్ కి సంబంధించిన పనులు చేయించుకోవడానికి 14,906 కోట్లు, నీటిపారుదల మౌలిక సదుపాయాల కోసం (హెచ్ఎన్ఎస్ఎస్ కావచ్చు, కెనాల్ నెట్వర్క్, మోడర్నైజేషన్స్, డ్రిప్ ఇరిగేషన్) ఇరిగేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కి 20,844 కోట్లు, గ్రామీణ స్థాయి నుండి రోడ్లని బాగు చేయాలనే ఉద్దేశంతో రూరల్ రోడ్ డెవలప్‌మెంట్ వర్క్స్ కూడా సుమారుగా 4,562 కోట్ల రూపాయలు కేటాయించడం జరుగుతుందని, అన్నీ కలుపుకుంటే 40 వేల కోట్లు ప్రభుత్వ తరపు నుంచి (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) సీఎం ఆదేశాల మేరకు ఈ యొక్క 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' అని ఒక ప్రాజెక్ట్ ప్రిపేర్ చేయడం జరిగిందని, దాన్ని అక్టోబర్ 2వ తేదీన ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తరపు నుంచి 40 వేల కోట్లు ఇన్వెస్ట్మెంట్ చేసినప్పుడు, దానితో కలుపుకొని ప్రైవేట్ సంస్థలు, కంపెనీలు, పారిశ్రామికవేత్తలు అందరి దగ్గర నుంచి కూడా సుమారుగా 60 వేల కోట్లు ఇన్వెస్ట్మెంట్ వస్తుందని గవర్నమెంట్ దృష్టిలో ఉందన్నారు. ఈ ప్రెస్ మీట్ లో జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఏపీఎమ్ఐపి పిడి రఘునాథరెడ్డి, ఇంచార్జి హార్టికల్చర్ జిల్లా అధికారి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేసే చేతులను....
# సమాజం గౌరవించాలి..!!

**....మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ ఉత్సవం.**

**.....అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల సేవలు సమాజానికి ఆదర్శం**

**....అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలు అమూల్యం.... మంత్రి సత్యకుమార్ యాదవ్**

**......14.03 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు.. 8.98 కోట్ల మంది లబ్ధిదారులకు సౌకర్యం.**

**పోషణ్ భీ పఢాయీ భీ తో ప్రారంభ విద్యకు మరింత ప్రాధాన్యం.... మంత్రి సత్యకుమార్ యాదవ్**



**బత్తలపల్లి, సెప్టెంబరు 26 తెలుగు స్వరం.**

సమాజంలో ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చిన్నారులు, తల్లులు, కుటుంబాల ఆరోగ్యం, పోషణ కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్ల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు. బత్తలపల్లి పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో - మిగతా3లో

# గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్

-మొదటిపేజీ తరువాయి

కనిగిరి మండలం వంగపాడు వద్ద కొండను తొలుస్తూ 350 మీటర్లు ఏర్పాటు చేస్తున్న రెండు సొరంగ మార్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 52 అడుగుల వెడల్పు 32 అడుగుల ఎత్తున టన్నెల్స్ నిర్మిస్తున్నారు. విజయవాడ వైపు వెళ్లే దారిలో 300 మీటర్లు, బెంగుళూరు వెళ్లే వైపు మార్గంలో వంద మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. పై గోడల నుంచి మట్టి పెళ్లలు విరిగి పడకుండా ఎప్పటికప్పుడు యంత్రాల సాయంతో కాంక్రీట్‌తో లైనింగ్ చేస్తున్నట్లు మేఘా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అడవిలో కొండల నడుమ సొరంగ మార్గాలు కనువిందు చేస్తున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ వే పూర్తయితే ఇప్పటివరకు 12 గంటలు పాటు పట్టే ప్రయాణ సమయం ఇకపై ఆరు గంటలు మాత్రమే పడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కనిగిరి ప్రాంతం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.



**342.24 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే**

అయితే బెంగళూరు నుంచి విజయవాడ వరకు నేరుగా వెళ్లేందుకు కొత్తగా ఎలాంటి ప్రత్యేక రోడ్డేమీ నిర్మించడం లేదు. బెంగళూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ చెక్‌పోస్ట్‌కు సమీపంలో గల కోడూరు వరకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బెంగళూరు–హైదరాబాద్ హైవేలో 110 కిలోమీటర్లు మేర ప్రయాణించాల్సి వస్తుంది. కోడూరు వద్ద యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే మొదలై, 343.24 కిలోమీటర్లు కొనసాగి ప్రకాశం జిల్లాలోని ముప్పవరం వద్ద చెన్నై–కోల్‌కతా రహదారిలో కలుస్తుంది. అక్కడి నుంచి చెన్నై–కోల్‌కతా రహదారిలో 115 కిలోమీటర్లు ప్రయాణించి విజయవాడకు చేరుకోవాలి. అంటే మధ్య 342.24 కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉంటుంది. దానికి అటూ ఇటూ ఇప్పుడున్న హైవేల్లో 225 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటోంది.

**పనులు జరుగుతున్న తీరిది :**

ఈ రహదారి శ్రీసత్యసాయి జిల్లాలో చిలమత్తూరు, గోరంట్ల, ఓడీసీ, పుట్టపర్తి, నల్లమాడ, ముదిగుబ్బ మీదుగా తలుపుల మండలంలోని నామాలగుండు వద్ద వైఎస్సార్ కడప జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ 75 కి.మీ.లో 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. పుట్టపర్తి మండలం సాతర్లపల్లి పరిధిలో కొండను తొలిచే పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నల్లమాడ నుంచి మలకవేముల క్రాస్ వరకు 15 కి.మీ. మేర రహదారి పూర్తయింది. మలకవేముల క్రాస్ వద్ద రైల్వే బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. మలకవేముల క్రాస్ నుంచి కొండగట్టుపల్లి వరకు బీటీ లేయర్ వేస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో వేముల, పులివెందుల, ఎర్రగుంట్ల, కమలాపురం, చాపాడు, మైదుకూరు, పోరుమామిళ్ల మీదుగా ఈ హైవే వెళ్తోంది. కమలాపురం మండలం కంచెన్నగారిపల్లె వద్ద పెన్నా నదిపై, చాపాడు మండలం అల్లాడుపల్లి వద్ద కుందూ నదిపై భారీ వంతెనల నిర్మాణం, మిగిలిన ప్రాంతాల్లో రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఈ జిల్లాలో కొన్నిచోట్ల భూసేకరణ సమస్యలతో పనులు జాప్యమవుతున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అత్యధికంగా 140 కి.మీ. ఉంది. సింగరాయకొండ నుంచి మైదుకూరు వైపు వెళ్లే ఎన్‌హెచ్–167బీ వద్ద ఇంటర్ ఛేంజ్ పనులు చేస్తున్నారు. మర్రిపూడి నుంచి సోమవరప్పాడు వరకు 13వ ప్యాకేజీలో పనులు చాలావరకు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌లో 5.31 కి.మీ. మేర ఏడు సొరంగాలు నిర్మిస్తున్నారు. నెల్లూరు జిల్లా సీతారామపురం మండల సరిహద్దులోని 3.67 కి.మీ. పొడవైన సొరంగం ప్రాజెక్ట్‌లో అతి పెద్దది.

# అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ..!

**గుంటూరు :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు. మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు. చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళ్తున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ–ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.



# ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. వంద శాతం స్టయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కల్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.



## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

-మొదటిపేజీ తరువాయి

బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

-మొదటిపేజీ తరువాయి

నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు

## విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'




-మొదటిపేజీ తరువాయి

కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయి.

**నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల సంఖ్య:**

విజయవాడ (తూర్పు) – 7,990, విజయవాడ (పశ్చిమం) – 7,465, విజయవాడ (సెంట్రల్) – 5,815, గన్నవరం – 602, జగ్గయ్యపేట – 1,135, మైలవరం – 981 నందిగామ – 54 తిరువూరు – 15

## మడకశిరకు రావలసిన హంద్రీనీవా నీటిని కుప్పం కు తరలించి, మడకశిరకు తీరని అన్యాయం.




**అమరాపురం సెప్టెంబర్ 26 తెలుగు స్వరం :** మడకశిర కు రావాల్సిన హంద్రీనీవా నీటిని తమ నాయకుడి మెప్పు కోసం కుప్పం కు తరలించి కూటమి నాయకులు మన ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నారని వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వై ఎన్ రవిశేఖర్ రెడ్డి, అమరాపురం మాజీ సర్పంచ్ వాగేష్ లు ఆరోపించారు. కొద్దిరోజుల క్రితం మడకశిర టీడీపీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మరీ సూపర్ ఎల్నినో వల్ల హంద్రీనీవా నీళ్లు ఇవ్వలేకపోతున్నామని చిలక పలుకులు పలికి దొడ్డిదారిన ఆ నీటిని కుప్పానికి తరలిస్తున్నారని , ఈ విషయాన్ని టీడీపీ ఫేస్బుక్ లో గొప్ప ఘనకార్యం చేసినట్టుగా పోస్ట్ చేశారని, దీనికి స్థానిక నాయకులు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. మడకశిర ప్రాంతంలో ప్రధానంగా అన్ని మండలాలలో వక్క పంట సాగు చేశారని దీనితోపాటు ఉద్యానవన పంటలైన దానిమ్మ, మామిడి పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు ఒక్క సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న పంటలు పూర్తిగా నష్టపోయే అవకాశం ఉంటుంది. ఎన్నికల్లో అన్ని చెరువులకు నీళ్లు ఇస్తామని కూటమినేతల పేర్కొన్న. కేవలం రెండేళ్లలో రెండు చెరువులకు మాత్రమే నీరు అందించారని ఆయన పేర్కొన్నారు. అందులో అమరాపురం చెరువుకి జల హారతి పూజకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తారని చిలక పలుకులు పలికారని దీనికి ఏమి సమాధానం చెప్తారని కూటమి నాయకులను వారు అడుగుతున్నారు. మడకశిర చెరువుకు కూడా పూర్తిస్థాయిలో నీరు అందించలేని పరిస్థితి ఉంటే. మరి ఎప్పుడు అన్ని మండలాలకు నీళ్లు ఇస్తారు అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రతి చెరువుకు కొద్దిపాటి నీరన్న వదిలి భూగర్భ జలాల పెంపుకు చర్యలు చేపట్టాలని లేకపోతే ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్ళముందే ఎండిపోతుంటే రైతాంగం ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం కూటమి నాయకులకు తెలియదా అంటున్నారు.

## సమాజ శ్రేయస్సు కై...
## జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉండాలి..!!

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక ప్రాధాన్యత ప్రస్తుత కాలంలో ప్రాణాంతకంగా మారుతున్న క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఈ శిబిరంలో ప్రత్యేకంగా క్యాన్సర్ స్క్రీనింగ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రజ్ఞా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ మరియు బసవతారకం ఆసుపత్రి నిపుణులు మొత్తం 110 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నివారణ మరియు ముందస్తు జాగ్రత్తలపై మార్గదర్శకాలను అందించారు. అహర్నిశలూ వార్తల సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, ప్రభుత్వం అందించే ఇటువంటి ఉచిత వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకుని నిరోగిగా జీవించాలని అధికారులు మరియు వైద్య నిపుణులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,డిఎండహెచ్ఓ ఫైరోజా బేగం,డిసిహెచ్ఎస్ కాంతి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,వైద్యులు,వైద్య ఆరోగ్య సిబ్బంధి తధితరులు పాల్గొన్నారు.

## బలమున్న చోట బరిలో దిగుదాం..!!

......స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ వ్యూహరచన

......కూటమి పార్టీలతో సమన్వయం.. బలమైన అభ్యర్థుల ఎంపికపై కీలక చర్చ

.....కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో....యస్. విష్ణువర్ధన్ రెడ్డి





**కదిరి: సెప్టెంబర్ 26 తెలుగు స్వరం.** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ నాయకులు, బీజేపీ ఆల్ సెల్ జాతీయ కో–కోఆర్డినేటర్ యస్. విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, క్షేత్రస్థాయిలో పార్టీ బలాబలాలు, నాయకుల అభిప్రాయాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రతి గ్రామం, మండలంలో పార్టీకి అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ రూపొందించడంపై నేతలు దృష్టి సారించారు. కూటమి పార్టీలతో సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొనే అంశం సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. స్థానిక పరిస్థితులు, సామాజిక సమీకరణాలు, పార్టీ బలాన్ని పరిగణనలోకి తీసుకుని పోటీ చేసే స్థానాలపై ప్రణాళిక రూపొందించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ప్రజల్లో మంచి పేరు, పార్టీ పట్ల నిబద్ధత, క్షేత్రస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు ఉన్న సమర్థులైన అభ్యర్థులను గుర్తించి ఎంపిక చేయాలని నిర్ణయించారు. అభ్యర్థుల ఎంపికలో పార్టీ శ్రేణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా యస్. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతమైన ఎన్నికల వ్యూహాన్ని అమలు చేయాలని అన్నారు. కదిరి నియోజకవర్గంలో బీజేపీకి బలమైన రాజకీయ పునాది నిర్మించడంతో పాటు, రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉత్తమ రెడ్డి, సుదర్శన్, పి.టి. ఆంజనేయులు, వెంకటేష్, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ డీ.ఎల్. ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు కేతే గిరిజమ్మ, మేకల నాగార్జున, ప్రతాప్, మైనారిటీ నాయకులు ఇంతియాజ్ ,షేక్ మైనుద్దీన్, బెల్లాల్, ఉత్తమ్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షులు షేక్ బాబ్జాన్, ఎర్రంశెట్టి రమేష్ బాబు, వేమ నారాయణ, బాబు రెడ్డి, నందిశెట్టి బాబు ,రవిచంద్ర నాయుడు ,రంగారెడ్డి, ఓబుల్ రెడ్డి ,మంజునాథ్ రెడ్డి ,శివ ప్రసాద్ రెడ్డి, నాగేశ్వరి, నాగవర్ధన్ రెడ్డి, జనార్ధన్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సేవ చేసే చేతులను....సమాజం గౌరవించాలి..!!



-మొదటిపేజీ తరువాయి

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ ఉత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ..... అంగన్‌వాడీ ఉత్సవం ఎందుకు నిర్వహిస్తున్నామో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సాధారణంగా జరిగే సంబరాలకు భిన్నంగా సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రజలకు సేవ చేసే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారని తెలిపారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగానే అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను గౌరవించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

### అంగన్‌వాడీ అంటే కేవలం పౌష్టికాహారం అందించే కేంద్రం కాదు ...

అంగన్‌వాడీ కేంద్రాల గురించి సమాజంలో ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి సత్యకుమార్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం అంటే పిల్లలను తీసుకురావడం, పౌష్టికాహారం అందించడం మాత్రమే కాదు. చిన్నారులకు ప్రాథమిక విద్య, ప్రారంభ బాల్య సంరక్షణ, వారి ఎదుగుదల, పోషణ, ఆరోగ్య పరిరక్షణతో పాటు తల్లిదండ్రులకు పోషణ, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించే ముఖ్యమైన కేంద్రాలు అని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14.03 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు సుమారు 8.98 కోట్ల మంది నమోదైన లబ్ధిదారులకు సేవలు అందిస్తున్నాయని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ గణాంకాలు చెబుతున్నాయి. పిల్లలకు పౌష్టికాహారం, ప్రీ–స్కూల్ విద్య, పోషణ––ఆరోగ్య అవగాహన, టీకాలు, ఆరోగ్య పరీక్షలు, అవసరమైన వారికి రిఫరల్ సేవలు అంగన్‌వాడీ వ్యవస్థ ద్వారా అందుతున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలకు ప్రతిరోజూ సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల సేవలు చిన్నవి కావు. వారి సేవలను సమాజానికి తెలియజేసి, వారిపట్ల గౌరవాన్ని పెంచడం మన బాధ్యత అని మంత్రి అన్నారు.

### ఆశా వర్కర్ల సేవలు కూడా అమూల్యం....

అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతికూల పరిస్థితుల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సేవలను కూడా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పనిచేస్తూ, తమ ఆరోగ్యం గురించి కూడా పట్టించుకోకుండా సేవలందించే ఆశా వర్కర్లపై ఎంతటి బాధ్యత ఉందో ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరింతగా తెలుసుకున్నాను. గ్రామస్థాయిలో ఆరోగ్య వ్యవస్థకు వారు కీలకమైన వారధిగా పనిచేస్తున్నారు అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లు చేస్తున్న సేవలను కేవలం ఒకరోజు సన్మానంతో ముగించకుండా వారి సేవలను సామాజిక మాధ్యమాలు, ప్రజా కార్యక్రమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఒక్కో కార్యకర్త, ఒక్కో హెల్పర్, ఒక్కో ఆశా వర్కర్ చేస్తున్న సేవను సమాజానికి పరిచయం చేసి వారిపట్ల మరింత గౌరవభావం కలిగేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

### వారి దగ్గరకే వెళ్లి గౌరవించాలన్నదే అసలు ఉద్దేశం ...

అంగన్‌వాడీ మిలన్ కార్యక్రమం అసలు ఉద్దేశం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడే కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లను సన్మానించి, వారితో మాట్లాడి వారి సమస్యలు, సాధకబాధకాలు తెలుసుకోవడమేనని మంత్రి వివరించారు. అయితే బత్తలపల్లిలో ఎక్కువ మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లు ఒకచోట కలిసి తనను కలిసే అవకాశం కల్పించిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. అందరి దగ్గరకు వ్యక్తిగతంగా వెళ్లి సన్మానించలేకపోయినా, ఇంతమందిని ఒకచోటకు తీసుకొచ్చి కలిసే అవకాశం కల్పించినందుకు నిర్వాహకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు అని అన్నారు.

### సక్షమ్ అంగన్‌వాడీలుగా అభివృద్ధి....

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆధునికంగా, బలోపేతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా 2 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను సక్షమ్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం లభించగా, 2026 జూలై నాటికి 1.29 లక్షల కేంద్రాలు సక్షమ్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ అయినట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చిన్న చిన్న భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగకుండా, వాటికి ప్రత్యేక గుర్తింపు, మెరుగైన వసతులు, పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవల్లో పోషణతో పాటు బాలల ప్రారంభ విద్యకు కూడా ప్రాధాన్యత పెరుగుతోందని, పోషణ్ భీ పఢాయీ భీ వంటి కార్యక్రమాల ద్వారా చిన్నారుల ప్రారంభ అభ్యాసాన్ని బలోపేతం చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం వెల్లడిస్తోందని మంత్రి తెలిపారు.

### సేవ చేస్తున్న వారి సేవలను గుర్తించడం సమాజ బాధ్యత....లి

సమాజంలో ముందుండి పనిచేసే వారికి మాత్రమే కాకుండా, ప్రజల మధ్య నిశ్శబ్దంగా సేవలు చేస్తున్న వారిని కూడా గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు చేస్తున్న సేవలను సమాజానికి తెలియజేయాలి. వారి సేవలకు గౌరవం దక్కేలా చూడాలి. ఈ కార్యక్రమం ఒకరోజుతో ముగిసేది కాదు. ఇకపై ఎక్కడికి వెళ్లినా, అవకాశం వచ్చిన ప్రతిసారీ వీరు చేస్తున్న సేవల గురించి మాట్లాడుతూనే ఉంటాం అని సత్యకుమార్ యాదవ్ అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా సేవ చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను గుర్తించి గౌరవించడం ద్వారా సేవ చేసే చేతులకు సమాజం అండగా నిలవాలి, సేవ చేసే వారికి గౌరవం పెరగాలి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే అంగన్‌వాడీ ఉత్సవం ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ మహిళా మోర్చా జనరల్ సెక్రెటరీ సుష్మా, స్టేట్ మహిళా మోర్చా కార్యదర్శి కోటి సుధా, బీజేపీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ కునిగిరి నీలకంఠ, సత్య సాయి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జగ్గా నాగరత్న, బిజెపి బత్తులపల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, బత్తలపల్లి పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కే లక్ష్మి, బత్తలపల్లి సిడిపిఓ సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'సర్' నోటీసులు..
## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

**ఢిల్లీ:** సర్ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. అంతర్గత విబేధాలు బయటపడిన తర్వాత తొలిసారి జరిగిన భేటీకి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఈసీలు సందు, జోషి హాజరయ్యారు. 'సర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంది. 'సర్'లో అభ్యంతరాలపై నవంబర్ 30 వరకు గడువు పొడిగించింది. నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదని.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారని ఈసీ తెలిపింది. ఎస్ఐఆర్‌లో నోటీసు వచ్చిన వారికి బీఎల్‌వోలు ఇంటికి వచ్చి డాక్యుమెంట్లు తీసుకొని ఈసీఐనెట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. అసాధారణ పరిస్థితుల్లోనే ఆన్‌లైన్ హియరింగ్. కుటుంబ సభ్యుడు కూడా హాజరు కావచ్చు. రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్

## తిమ్మమ్మ మర్రిమాను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులు....



**నంబులపూలకుంట, సెప్టెంబర్ 26 తెలుగు స్వరం (బ్యూరో)** ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిమ్మమ్మ మర్రిమాను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే సురేష్ రెడ్డి, గుణరంజన్ లు శనివారం సందర్శించారు. న్యాయమూర్తులకు ఆలయ కమిటీ వారు కదిరి ఆర్డిఓ కళావతి స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తులు తిమ్మమాంబ, బాల వీర్యలనుదర్శించుకున్నారు. తిమ్మమాంబకు న్యాయమూర్తులు పూజలు చేసి అమ్మవారిఆ శీస్సులు పొందారు. తిమ్మమాంబ ఆలయం వద్ద కమిటీ సభ్యుడువెంకటనారాయణ, రంగారెడ్డి చే న్యాయమూర్తులకు దృశ్యాలవలకప్పి సత్కరించారు. తిమ్మమ్మ మర్రిమాను చరిత్రపై న్యాయమూర్తులు ఆరా తీశారు. అనంతరం మర్రి మాను పరిసరాలను పరిశీలించారు.న్యాయమూర్తులకు బందోబస్తు గా ఎస్సై కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఉత్సవాలకు... తిమ్మమ్మ మర్రిమాను రెడీ.

....నేడు తిమ్మమ్మ మర్రిమాను లో ప్రపంచ పర్యాటక దినోత్సవం ఏర్పాట్లు పూర్తి

మర్రిమానులు ఏడెకరాల్లో బొటానికల్ పార్కుకు ఏర్పాటుపై నేడు ఎమ్మెల్యే కలెక్టరుచే శంకుస్థాపన......





**నంబులపూలకుంట, సెప్టెంబర్ 26 తెలుగు స్వరం (బ్యూరో)** మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిమ్మమ్మ మర్రి మానులో నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చకచక పూర్తి చేసి సిద్ధం చేశారు. ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు మర్రిమానులో ఆకట్టుకునే విధంగా సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకగా నిర్వహిద్దామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నలుమూలలా ఉండే ప్రజలను తరలివచ్చి వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మర్రిమాను వద్ద ఏర్పాటైన శివఘాటు సమీపంలో ఏడు ఎకరాలు విస్తీర్ణంలో బొటానికల్ పార్కు ఏర్పాటు కోసం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికార యంత్రాంగం తెలిపారు. మర్రిమానులో పర్యాటక దినోత్సవం ఏర్పాట్లపై కదిరి ఆర్డిఓ కళావతి, మండల తాహసిల్దార్ లక్ష్మమ్మ, ఎంపీడీవో పార్థసారథి, ఉప తాహసిల్దార్ దేవేంద్ర నాయక్ ,డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి, వీరితోపాటు పలు శాఖ అధికారులు, కమిటీ సభ్యులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి పర్యవేక్షించారు.

## అభయాంజనేయ విగ్రహ ప్రతి ష్ట పూజల్లో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే....

విగ్రహ ప్రతిష్ట పూజల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కు ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందించిన గ్రామస్తులు....





**కదిరి, నంబులపూలకుంట, సెప్టెంబర్ 26 తెలుగు స్వరం (బ్యూరో)** కదిరి రూరల్ మండలంలోని పందికుంట గ్రామస్తులు భక్తి భావంతోమహా గణపతి, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలోకార్యక్రమం శనివారం నిర్వహించారు. పందులకుంట గ్రామంలో నిర్వహించిన శ్రీ మహా గణపతి ప్రతిష్టాపన, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి కదిరి నియోజకవర్గశాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.ఎమ్మెల్యేకి పందులకుంట గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. గ్రామస్తుల ఆత్మీయతకు ఎమ్మెల్యే గారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చక్రవర్ధన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో, చేనేత మగ్గంపై ప్రత్యేకంగా కందికుంట వెంకటప్రసాద్ గారి చిత్రాన్ని అల్లిన అందమైన శాలువాతో ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. గ్రామస్తులు, భక్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A5612 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881